క్లుప్తంగా

ఆరుగురు జూదరుల అరెస్ట్

మదనపల్లె : మదనపల్లె రూరల్ పరిధిలోని చిప్పిలి గ్రామం ఎల్.వి.ప్రసాద్ కంటి ఆస్పత్రి సమీపంలోని పేకాట స్థావరంపై దాడులు చేసి ఆరుగురిని అరెస్ట్ చేసినట్లు తాలూకా సీఐ సత్యనారాయణ తెలిపారు. ముందస్తు సమాచారంతో దాడులు నిర్వహించినట్లు చెప్పారు. దాడుల్లో నిందితుల వద్ద నుంచి రూ.10,400 స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వారిపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఎస్ఐ చంద్రశేఖర్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

1960 మందికి జగనన్న చేదోడు

పీలేరు : నియోజకవర్గంలో 1960 మంది లబ్ధిదారులకు జగనన్న చేదోడు పథకం వర్తించినట్లు ఎంపీడీఓ మురళీమోహన్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ నాయీబ్రాహ్మణులు, దోబీలు, టైలర్లకు ఒక్కో లబ్ధిదారునికి రూ. 10 వేలు చొప్పున వారి వ్యక్తిగత ఖాతాలకు జమ అయినట్లు తెలిపారు. మండలాల వారీగా పీలేరు 538, కేవీపల్లె 144, కలకడ 201, గుర్రంకొండ 231, వాల్మీకిపురం 608, కలికిరి 238 మందికి జగనన్న చేదోడు పథకం వర్తించినట్లు వివరించారు.

వేలం ద్వారా రూ.3.08 లక్షల ఆదాయం

గుర్రంకొండ: స్థానిక పోలీస్‌స్టేషన్లో ఎక్సైజ్ కేసుల్లో సీజ్ చేసిన వాహనాలకు నిర్వహించిన వేలం ద్వారా రూ. 3.08లక్షల ఆదాయం వచ్చింది. సోమవారం ఎస్ఐ దిలీప్‌కుమార్ ఆధ్వర్యంలో స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణంలో ఐదు ద్విచక్రవాహనాలు, మూడు ఎల్ఎంవీ వాహనాలకు వేలం నిర్వహించారు. ముందుగా వేలంలో పాల్గొన 14 మంది పాటదారుల నుంచి రూ.5వేలు చొప్పున డిపాజిట్టు కట్టించుకొన్నారు. ఈ వేలం పాటల ద్వారా రూ.2,62,700, జీఎస్టీ రూపంలో రూ.46,282 మొత్తం రూ. 3,08,986 వచ్చినట్లు ఎస్ఐ తెలిపారు. ఈ మొత్తాన్ని వాల్మీకిపురం ట్రెజరీలో జమచేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

వాహనాల వేలం

మదనపల్లె : వాహనాల వేలంద్వారా రూ.1.89లక్షల ఆదాయం ప్రభుత్వానికి సమకూరినట్లు ఎస్ఐ హరిహరప్రసాద్ తెలిపారు. సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఒక కారు, ఏడు ద్విచక్రవాహనాలకు వేలం నిర్వహించగా 20 మంది డిపాజిట్లు చెల్లించి వేలంలో పాల్గొన్నారన్నారు.

రెండవ విడతలో 1,405 పక్కా గృహాలు మంజూరు

పెద్దతిప్పసముద్రం: మండలానికి రెండవ విడతలో 1,405 జగనన్న పక్కా గృహాలు మంజూరైనట్లు హౌసింగ్ ఏఈ శ్రీనివాసులు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ మంజూరైన వాటిలో 1,359 మందికి స్వంత స్థలాలు ఉండగా, స్థలాలు లేని 46 మంది లబ్ధిదారులకు గృహాలు మంజూరయ్యాయన్నారు. మొదటి విడతలో మండలానికి 2,451 గృహాలు మంజూరు కాగా రెండు విడతల్లో మొత్తం 3,856 గృహాలు మంజూరైనట్లు ఏఈ పేర్కొన్నారు.

కాట్నగల్లు వీఆర్వోగా సుస్మిత

పెద్దతిప్పసముద్రం: మండలంలోని కాట్నగల్లు గ్రామం వీఆర్వోగా సుస్మిత నియమితులైనట్లు తహసీల్దార్ విద్యాసాగర్ సోమవారం పేర్కొన్నారు. ఈమె గతంలో మదనపల్లి సమీపంలోని కొత్తవారిపల్లిలో పని చేస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇన్నాళ్ళూ ఇక్కడ ఇన్‌చార్జి వీఆర్వోగా చినపరెడ్డి పని చేసేవారు.

బయోమెట్రిక్ హాజరు నమోదులో ఫస్ట్

పెద్దతిప్పసముద్రం: గ్రామ సచివాలయాల్లో పని చేసే సిబ్బంది బయోమెట్రిక్ హాజరు నమోదులో అన్నమయ్య జిల్లాలోనే పెద్దతిప్పసముద్రం మండలం మొదటి స్థానంలో ఉన్నట్లు ఆన్‌లైన్‌లో నమోదైంది. మండలంలోని 15 సచివాలయాల్లో 137 మంది సిబ్బంది ఉండగా వీరిలో 127 మంది (92.70 శాతం) సకాలంలో హాజరు నమోదు చేసినట్లు నమోదైంది.

డ్రైవర్ల కుటుంబ సభ్యులకు కౌన్సెలింగ్

మదనపల్లె సిటీ: రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా సోమవారం స్థానిక ఆర్టీసీ టు డిపో కార్యాయలంలో డ్రైవర్ల కుటుంబ సభ్యులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. విధి నిర్వహణకు బయలుదేరే డ్రైవర్లకు కుటుంబసభ్యులు అండగా నిలవాని డీఎం నిరంజన్ కోరారు. డ్యూటీకి వెళ్లేటప్పుడు ఆప్యాయంగా పలకరించి పంపాలన్నారు. కార్యక్రమంలో సీఐలు రేవతి, గీత, సిబ్బంది పాల్గొన్నారు.

టీచర్ల పనితీరు భేష్

తంబళ్లపల్లె: మండలంలోని కన్నెమడుగు పంచాయతీ రెడ్డివారిపల్లె ప్రాథమిక పాఠశాలను సోమవారం ఎంఈవో త్యాగరాజు తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. విద్యార్థుల అభ్యసన స్థాయిని ప్రశ్నించి తెలుసుకున్నారు. ఇద్దరు మహిళా టీచర్ల పనితీరుతో విద్యార్థుల్లో అభ్యసన స్థాయి సంతృప్తికరంగా ఉందని అభినందించారు.

డ్రోన్ ద్వారా భూ రీసర్వే

పెద్దతిప్పసముద్రం: భూ రికార్డుల స్వచ్ఛీకరణలో భాగంగా సోమవారం మండలంలోని మద్దయ్యగారిపల్లి పంచాయతీలో డ్రోన్ ద్వారా భూముల రీ సర్వే కార్యక్రమం నిర్వహించారు. తహసీల్దార్ విద్యాసాగర్, డివిజనల్ సర్వేయర్ క్రిష్ణమూర్తి, మండల సర్వేయర్ రఫీ, ఆర్ఐ అనీషా, వీఆర్వో సుస్మిత రీసర్వేలో పాల్గొన్నారు.

మహాత్మాగాంధీ మార్గం అనుసరణీయం

ఆర్డీఓ ఎం.ఎస్.మురళి





మదనపల్లె : మహాత్మాగాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఆర్డీఓ మురళి, కలికిరి: గాంధీ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

మదనపల్లె : సత్యం, అహింస అనే ఆయుధాలతో స్వాతంత్య్ర సంగ్రామాన్ని ముందుకునడిపించిన జాతిపిత మహాత్మాగాంధీ మార్గం నేటితరానికి అనుసరణీయమని ఆర్డీఓ ఎం.ఎస్.మురళి అన్నారు. గాంధీజీ వర్ధంతి సందర్భంగా సోమవారం సబ్‌కలెక్టరేట్‌లోని మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవభారత నిర్మాణానికి గాంధీ మహాత్ముడి బోధనలు మార్గదర్శనీయమన్నారు. కార్యక్రమంలో డీఏఓ శేషయ్య, తహసీల్దార్ కృష్ణమోహన్, డీటీ నవీన్, సబ్ కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. అలాగే వాల్మీకిసంఘం ఆధ్వర్యంలో నాయకులు పులిశీన, శంకర, జయసింహ తదితరులు సబ్ కలెక్టరేట్‌లోని మహాత్మాగాంధీ విగ్రహానికి నివాళులర్పించారు.

వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో..

మదనపల్లె సిటీ: మహాత్మాగాంధీ వేడుకలు మదనపల్లె సోమవారం వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో వాసవీ క్లబ్ అధ్యక్షులు నరేంద్రకుమార్, కార్యదర్శి అశోక్ కుమార్, కోశాధికారి లక్ష్మీపతి, కృష్ణారావు, పాల్గొన్నారు. పాఠశాల హెచ్ఎం రెడ్డన్నశెట్టి, ఉపాధ్యాయులు తదితరులు గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

ఘనంగా జాతిపిత గాంధీ వర్ధంతి

రామసముద్రం: రామసముద్రం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం మహాత్మాగాంధీ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఎంపీపీ కుసుమకుమారి, జెడ్పీటీసీ రామచంద్రారెడ్డి, మెడికల్ ఆఫీసర్ లీలావతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా గాంధీజి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణంలో మొక్కలు నాటారు. అనంతరం ఆసుపత్రిలో ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో విద్యుత్‌శాఖ మస్తాన్, ఇన్‌చార్జ్ ఎంపీడీవో సురేష్, డిటి విశాక్ తదితరులు పాల్గొన్నారు.

మహాత్ముని అడుగుజాడల్లో నడుద్దాం

కలికిరి: జాతిపిత మహాత్ముని అడుగుజాడల్లో నడుద్దామని వైఎస్సార్ విద్యార్థి విభాగం నరేష్ అన్నారు. గాంధీజీ వర్ధంతిని పురస్కరించుకుని స్థానిక శ్రీనివాసా కళాశాలలో చిత్రం పటం ఏర్పాటు చేసి నివాళులు అర్పించారు. గాంధీ అడుగుజాడల్లో నడవడానికి యువత కృషి చేయాలని, ఆయన స్ఫూర్తితో ముందుకు సాగితే విజయం తథ్యమన్నారు. కళాశాల అధ్యాపకులు ఖదీర్ భాష, రవి, నూర్ మహమ్మద్, విద్యార్థులు పాల్గొన్నారు.



పీలేరు : గాంధీ వర్ధంతి వేడుకలో ఆర్యవైశ్య సంఘం నాయకులు

గాంధీ మార్గం ఆదర్శం

కలకడ : మహాత్మాగాంధీ చూపిన మార్గం అందరికీ ఆదర్శమని ఎంపీపీ శ్రీదేవి అన్నారు. సోమవారం జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గాంధీజీ చిత్రపటానికి నివాళి అర్పించి ఆయన చేసిన సేవలు, త్యాగాలను కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నారాయణ, ఏపీఓ చెన్నకేశులు, ఏఈ రూప్‌సాగర్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో..

పీలేరు : మహాత్మాగాంధీ వర్ధంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో గాంధీ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గాంధీ శాంతి మార్గంలో దేశానికి స్వాతంత్రం సాధించారని పేర్కొన్నారు. గాంధీ చూపిన అహింస, శాంతి మార్గాల్లో ప్రజలు నడుచుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు మల్లికార్జునశెట్టి, శ్రీనివాసులు, వెంకటేష్, సురేష్, పణి, అరవింద్‌బాబు, సుధీర్, నాగరాజ, జయచంద్ర, చెంగయ్య, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

స్పందన అర్జీలకు సత్వర పరిష్కారం

మదనపల్లె : ప్రజాసమస్యల పరిష్కారానికి ప్రతి సోమవారం సబ్ కలెక్టరేట్‌లో నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమంలో ప్రజలు సమర్పించే అర్జీలపై సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆర్డీఓ ఎం.ఎస్.మురళి అన్నారు. స్పందన కార్యక్రమంలో భాగంగా మదనపల్లె రెవెన్యూ డివిజన్ పరిధిలో ప్రజలు 41 వినతులు సమర్పించారు. మట్టిమాఫియాను అడ్డుకోవాలని కురబలకోట మండలం చింతమాకులపల్లెకు చెందిన రైతు సదాశివ ఆర్డీఓకు విన్నవించారు. కొంతమంది ఇటుకబట్టీల కోసం మన్ను కావాలని కోరుతూ విచ్చలవిడిగా అక్రమరవాణాకు పాల్పడుతున్నారన్నారు. తమ పొలం గుండా వాహనాలు రవాణా చేస్తుండటంతో ప్రశ్నించినందుకు తనపై దాడికి పాల్పడ్డారని చెప్పుకొచ్చారు. కురబలకోట మండలం గోల్డెన్‌వ్యాలీ కళాశాల వద్ద తాము కొనుగోలు చేసిన ఇళ్లస్థలాలను జాతీయరహదారి కోసం భూసేకరణ చేశారని, ప్రభుత్వం ప్రకటించిన నష్టపరిహారం తమకు సరిపోదని, తమకు వేరొకచోట ప్రభుత్వస్థలం కేటాయించాలని కోరారు.

డబుల్ ఎంట్రీ అసెస్మెంట్లు తొలగించండి

- మాజీ సైనికులకు ఇంటిపన్ను మినహాయింపు
- కోమటివానిచెరువులో వ్యర్థాలు వేయకుండా చర్యలు
- అజెండాలోని 19 అంశాలకు కౌన్సిల్ ఆమోదం



సమస్యలను మున్సిపల్ చైర్‌పర్సన్‌కు వివరిస్తున్న వైస్‌చైర్మన్ జింకాచలపతి

మదనపల్లె : మున్సిపల్ పరిధిలో ఆస్తి, నీటిపన్నుకు సంబంధించి డబుల్ ఎంట్రీ అసెస్మెంట్లు, నాట్ ట్రేస్ అసెస్మెంట్లను రెవెన్యూ అధికారులు తొలగించి ప్రజలపై భారం తగ్గించాలని చైర్‌పర్సన్ మనూజారెడ్డి ఆదేశించారు. మున్సిపాలిటీలో సోమవారం కౌన్సిల్ సాధారణ సమావేశం జరిగింది. అజెండాలోని అంశాలపై వైస్‌చైర్మన్ జింకాచలపతి ప్రస్తావిస్తూ.. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా వార్డుల పర్యటనలో ఎమ్మెల్యే నవాజ్‌బాషా దృష్టికి పలువురు డబుల్ అసెస్మెంట్లు విషయం ప్రస్తావించడంతో ఆయన ఆదేశాలమేరకు అధికారులు చర్యలు తీసుకోవడం అభినందనీయమన్నారు. అలాగే మాజీ సైనికులకు ఇంటిపన్ను మినహాయింపుకు సంబంధించి రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి న్యాయం చేయాలన్నారు. కోమటివానిచెరువులో వ్యర్థాలు వేయకుండా, మురుగునీరు మళ్లించకుండా చర్యలు తీసుకుని, వారానికి ఒకసారి పారిశుధ్య కార్మికులతో పరిసరాలను శుభ్రం చేయాలన్నారు. 19వవార్డు కౌన్సిలర్ బి.ఏ.ఖాజా మాట్లాడుతూ.. ఆస్తిపన్నుకు సంబంధించి బిల్డింగ్ కొలతల తేడాలు, నాన్ కమర్షియల్ అసెస్మెంట్లను కమర్షియల్‌గా పరిగణించడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, రెవెన్యూ అధికారులు తొలగింపు దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. 6వవార్డు కౌన్సిలర్ ప్రసాద్‌బాబు, 23వవార్డు కౌన్సిలర్ గిరిజా, 9వవార్డు కౌన్సిలర్ పాల్‌చంద్రశేఖర్ వివిధ సమస్యలపై మాట్లాడారు. అనంతరం అజెండాలోని 19 అంశాలకు కౌన్సిల్ సభ్యులు ఆమోదం తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ నూర్‌ఆజం, వార్డు కౌన్సిలర్లు, కోఆప్షన్ మెంబర్లు, మున్సిపల్ కమిషనర్ ప్రమీల, డీఈ బండపల్లిశిరీషా, ఏఈ స్నేహప్రియ, ఆర్వో పల్లవి తదితరులు పాల్గొన్నారు.

సీటీఎం జాతరను విజయవంతం చేయాలి



జాతర పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సర్పంచ్‌లు

మదనపల్లె సిటీ: జిల్లాలో అత్యంత పేరుగాంచిన సీటీఎం నలవీరగంగాభవానీ జాతరను విజయవంతం చేయాలని సర్పంచులు ఆనందపార్థసారధి, మహేష్, బుడ్డయ్యలు కోరారు. సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద జాతర పోస్టర్లను ఆవిష్కరించారు. జిల్లాలో మొట్టమొదట జరిగే సీటీఎం జాతరను ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఫిబ్రవరి 5న మూలవిరాట్టుకు పంచామృతాభిషేకం, రాత్రి అమ్మవారి ఆలయ ప్రవేశం, స్వస్తిపుణ్య వచనః జాగరణ, 6న సిద్దుల భుక్తి, అమ్మవారి ఊరేగింపు, 7న రాత్రి తిరుణాల, అమ్మవారి ఊరేగింపు, 8న పగలు తిరుణాల, 9న దోపు తిరుణాల ఘనంగా నిర్వహిస్తామన్నారు. అలాగే 9 నుంచి 13 వరకు ఎద్దుల పరుష నిర్వహించడం జరుగుతుందన్నారు. వెలుగు చంద్ర, సురేంద్రరెడ్డి, పొగాకు వీరప్రతాప్ పాల్గొన్నారు.

పన్నులు సకాలంలో చెల్లించండి



మాట్లాడుతున్న సర్పంచ్ హబీబ్‌బాషా

పీలేరు : ఇంటి, నీటి కొళాయి పన్నులు సకాలంలో చెల్లించి గ్రామ పంచాయతీ అభివృద్ధికి సహకరించాలని సర్పంచ్ డాక్టర్ హబీబ్‌బాషా అన్నారు. సోమవారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో బిల్ కలెక్టర్లు, వాటర్‌మెన్‌లు, పారిశుధ్య కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీ కోటి పైగా బకాయిలు ఉన్నాయని తెలిపారు. బిల్ కలెక్టర్లు చురుగ్గా పని చేసి పన్నులు వసూళ్లు చేయాలన్నారు. పారిశుధ్య కార్మికులు మరింత బాధ్యతగా పని చేసి పంచాయతీ అభివృద్ధికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఈవో రెడ్డిప్రసాద్‌రెడ్డి, శ్యానిటరీ ఇన్స్‌పెక్టర్ రవికుమార్ పాల్గొన్నారు.

కుష్టు వ్యాధిపై ఆందోళన అవసరం లేదు



కుష్టు నివారణపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి

కేవీపల్లె : కుష్టు వ్యాధిపై ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ఈ వ్యాధికి ఉచిత చికిత్స లభిస్తోందని గర్నిమిట్ట, జిల్లేళ్లమంద పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ శ్యామల, డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం గర్నిమిట్ట, జిల్లేళ్లమందలో «స్పర్శ» కుష్టువ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్లు మాట్లాడుతూ కుష్టు వ్యాధిగ్రస్తుల పట్ల కుటుంబ సభ్యులు, సమాజం ఎలాంటి వివక్షత చూపరాదన్నారు. ఎవరికైనా శరీరంపై స్పర్శలేని మచ్చలుంటే వెంటనే సమీపంలోని పీహెచ్‌సీలో సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ కృష్ణవేణి, ఆరోగ్యసిబ్బంది భాగ్యలక్ష్మీ, కృష్ణమ్మ, పురుషోత్తం, చెన్నమ్మ, జలజ, లలిత, గీతకుమారి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చిరుధాన్యాల సాగుపై అవగాహన



మాట్లాడుతున్న రాష్ట్ర వ్యవసాయశాఖ పర్యవేక్షణాధికారి లక్ష్మణ రెడ్డి

వాల్మీకిపురం: చిరుధాన్యాల సాగుకు రైతులందరూ ముందడుగు వేయాలని రాష్ట్ర వ్యవసాయశాఖ పర్యవేక్షణాధికారి లక్ష్మణ రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక ఆర్‌బీకేలో 2023 ఏడాది ఐక్యరాజ్య సమితి అంతర్జాతీయ చిరుధాన్యాల ఏడాదిగా ప్రకటించిన సందర్భాన్ని పురస్కరించుకొని డివిజన్‌స్థాయిలో రైతులకు చిరుధాన్యాల సాగుపై అవగాహన కల్పించారు. ప్రభుత్వం నుంచి చిరుధాన్యాల సాగుకు ప్రోత్సాహకాలు, విత్తన రాయితీ తదితర అంశాలపై వివరించారు. మండల స్థాయి అధికారులంతా చిరుధాన్యాల సాగుకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏడీఏ వాణిశ్రీ, డిఆర్‌సి ఏడీఏ శ్రీకాంత్, ఆర్‌బీకే చైర్మెన్ నీళ్లభాస్కర్, సర్పంచ్ గంగులమ్మ, జడ్పీటీసీ నిర్మల, ఉపసర్పంచ్ కేశవ రెడ్డి, కేవీకే శాస్త్రవేత్త పీర్ సాహెబ్, ఏవో హేమలత, వివిధ మండలాల వ్యవసాయ అధికారులు, ఆర్‌బీకే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

రెడ్డెమ్మతల్లిని దర్శించుకొన్న రాజమండ్రి జడ్జి

గుర్రంకొండ: మండలంలోని చెర్లోపల్లె గ్రామంలో వెలసిన రెడ్డెమ్మకొండ ఆలయాన్ని రాజమండ్రి జిల్లా కోర్టు జడ్జి సురేష్‌బాబు దర్శించుకొన్నారు. సోమవారం స్థానిక ఆలయానికి చేరుకొన్న ఆయన్ను ఆలయ కమిటీ చైర్మన్ నరసింహారెడ్డి, ఆలయ అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఈసందర్భంగా అమ్మవారిని దర్శించుకొన్న ఆయన అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి చీరె, సారే సమర్పించారు. నూతనంగా నిర్మించనున్న అమ్మవారి ఆలయాన్ని పరిశీలించారు. అనంతరం జడ్జిని సత్కరించి తీర్థప్రసాదాలను అందజేశారు.

లక్ష్మీనరసింహ అవతారంలో జనార్ధనస్వామి



లక్ష్మీ నరసింహస్వామి అవతారంలో దర్శనమిస్తున్న జనార్ధన స్వామి

రామసముద్రం: రామసముద్రం మండల కేంద్రంలో వెలసిన శ్రీలక్ష్మీ జనార్ధనస్వామి బ్రహ్మరథోత్సవంలో భాగంగా సోమవారం స్వామివారు శ్రీలక్ష్మీ నరసింహ అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకాలు , కుంకుమార్చనలు ఘనంగా నిర్వహించారు. చుట్టు పక్కల ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు పార్థసారధి భట్టర్, కులశేఖర్‌భట్టర్ భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

స్కీంబోరు నీరు రెండు కుటుంబాలకేనా?



పైప్‌లైన్ పనులను అడ్డుకుంటున్న గ్రామస్తులు

కలకడ : గ్రామానికి ఏర్పాటు చేసిన స్కీం బోరు నీరు కేవలం రెండు కుటుంబాలకేనా అని గ్రామస్తులు నిలదీశారు. సోమవారం మండలంలోని కె.బాటవారిపల్లె పంచాయతీ లో గ్రామానికి నీరు అందించే స్కీం బోరుకు చెందిన పైప్‌లైన్‌కు ఇద్దరు టీడీపీ నాయకులు మాత్రం అక్రమంగా నీటిని వినియోగించుకుంటున్నారు. గ్రామంలోని అనేక కుటుంబాలకు మంచినీరు అందకుండా చేయడంపై గ్రామస్తులు అడ్డుపడ్డారు. కేవలం రూ.150 వెచ్చించి గేట్‌వాల్వ్ ఏర్పాటు చేస్తే అన్ని కుటుంబాలకు నీరు అందుతుందని గ్రామస్తులు తెలిపారు. ఉప సర్పంచ్ వినకుండా రూ.లక్షలు ఖర్చుపెట్టాలనిఅదనపు పైప్‌లైన్ వేస్తామంటూ మాయమాటలు చెప్పి దాటవేత సమాధానం తప్ప అధికారులు కూడా స్పందించడం లేదని ఆరోపించారు. శాశ్వత కుళాయిలు ఏర్పాటు చేసి అక్రమంగా ఉన్న పైప్‌లైన్లు తొలగించాలని కోరారు. సమస్యపై ఎంపీడీఓ నారాయణ విచారణ జరిపి రెండు రోజుల్లో గేట్‌వాల్వ్ ఏర్పాటు చేసి అన్ని కుటుంబాలకు మంచినీరు అందించే ఏర్పాటు చేస్తామన్నారు.

భక్తిశ్రద్ధలతో గరీబ్‌నవాజ్ చట్టీ చదివింపులు

వాల్మీకిపురం: స్థానిక ప్రాచీన సయ్యద్ ఖాజాపీర్ మస్తాన్ వలి దర్గా ఆవరణంలో సోమవారం గరీబ్ నవాజ్ చట్టీ కార్యక్రమాన్ని ముస్లిం సోదరులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అంతకు ముందు దర్గాను శుద్ధిచేసి వివిధ రకాల పుష్పాలతో దర్గాను సుందరంగా అలంకరించారు. తదుపరి చాదర్‌ను దర్గాకు సమర్పించుకున్నారు. ముస్లిం మతపెద్దలు భక్తిగీతాలాపన కార్యక్రమం అనంతరం దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు, చదివింపులు నిర్వహించారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షులు సందాని, ఆఘామొహియుద్దిన్, కరీం, అమీర్ హుస్సేన్, అబ్దుల్ అజీం, సొహెద్, జాకీర్, జబ్బార్ సాహెబ్, అమీన్ పీర్, ఖలందర్, జాకీర్, గౌస్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

ఉరుసు పోస్టర్ల ఆవిష్కరణ



ఉరుసు పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాష తదితరులు

కడప కల్చరల్ : ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా సోమవారం తన కార్యాలయంలో మహల్ పట్టణానికి చెందిన ఉరుసు పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దర్గా పీఠాధిపతి మాట్లాడుతూ ఫిబ్రవరి 11న గంధం ఉత్సవం, 12న ఉరుసు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉరుసురోజున ఖవ్వాలీ కచేరి ఉంటుందని తెలిపారు. ఈ ఉత్సవాలకు తప్పక రావాలని డిప్యూటీ సీఎంను ప్రత్యేకంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఖ్వాజీ సిరాజుద్దీన్ బుఖారి, జమీల్ బుఖారి, జహరుల్లా హుసేనీ, సయ్యద్ అబ్రాబ్, ఇలియాస్ ఖాద్రీ, సయ్యద్ సలావుద్దీన్, మహబూబ్‌బాష తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీవారి చక్రస్నానం

తంబళ్లపల్లె: మండలంలోని కోసువారిపల్లెలో వెలసిన శ్రీప్రసన్న వెంకటరమణస్వామి ఆలయంలో టిటీడీ ఆధ్వర్యంలో 10 రోజులుగా స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు కనువిందుగా వైభవంగా జరుగుతున్నాయి. సోమవారం అర్చకులు క్రిష్ణప్రసాద్‌బట్టార్, రాఘవేంద్రస్వామి, రమేష్‌బాబు సంప్రదాయబద్ధంగా శ్రీనివాసుడికి చక్రస్నానం కనువిందుగా నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున కార్యక్రమానికి హాజరై తనివితీరా తిలకించి తరించారు. రాత్రి ధ్వజారోహణ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు.

రైతుపై దౌర్జన్యం

నిమ్మనపల్లె: ఓ రైతుపై దౌర్జన్యానికి పాల్పడి, అతని బోరు బావి వద్ద వైర్లు తీసివేసి, కరెంటు పోల్స్ విరగగొట్టిన సంఘటన నిమ్మనపల్లె మండలంలో సోమవారం జరిగింది. బాధితుడు నిమ్మనపల్లె పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆ మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలంలోని చల్లావారిపల్లెకు చెందిన మొగల్ నవాజ్‌బేగ్ కుమారుడు ఎం.సయ్యద్‌బేగ్‌కు కొంత పొలం వుంది. 15 హెచ్‌పీ కరెంటు కనెక్షన్ ఈనెల 26న విద్యుత్‌శాఖ మంజూరు చేసి ఇచ్చారు. అయితే సయ్యద్‌బేగ్ పక్క పొలానికి చెందిన ఎం.జబ్బార్‌బేగ్ కుమారుడు ఖాదర్‌బేగ్, అతని కుమారుడు షఫీబేగ్‌లు వారికి బోరు మోటారు లేకున్నా దౌర్జన్యంగా సయ్యద్‌బేగ్‌కు చెందిన కరెంటు వైర్లు తొలగించే క్రమంలో కొత్త కరెంటు పోల్స్ దెబ్బతిన్నాయి. ఈ విషయమై బాధితుడు ప్రశ్నించగా అతనిపై దౌర్జన్యం చేసి దాడికి పాల్పడ్డాడు. తనకు న్యాయం చేయాలంటూ విద్యుత్‌శాఖ ఏఈకి, పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

నిరుపేద దళితులకు ప్రభుత్వ భూములు

బి.కొత్తకోట: నిరుపేద దళితుల అభివృద్ధి కోసం నిబంధనల ప్రకారం ప్రభుత్వ భూములను కేటాయిస్తామని తహసీల్దార్ ధనుంజయులు అన్నారు. సోమవారం మండలంలోని బడికాయలపల్లెలో పౌరహక్కుల దినం సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళితులపై ఎవరైనా దౌర్జన్యాలు, దాడులకు పాల్పడితే బాధితులు తక్షణమే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. బాధితులకు న్యాయం జరిగేలా మండలస్థాయి అధికారులు చర్యలు తీసుకుంటారన్నారు. దళితులపట్ల వివక్ష చూపితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎంపీడీఓ మంగళం శంకరయ్య, ఎంఈవో రెడ్డిశేఖర్, ఏఈ లావణ్య, సర్పంచు అదెన్న, ఎంపీటీసీ యల్లప్ప, ఏపీఓ మంజుల, ఏఎస్ఐ బొజ్జేనాయక్, అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పరుగు పదెంలో ప్రతిభ

ములకలచెరువు: మండలంలోని బురకాయలకోట జెడ్పీహైస్కూల్‌కు చెందిన పి.నాగశ్రీ అండర్ -14 రాష్ట్ర స్థాయి బాలికల పరుగు పందెంలో ప్రతిభకనబరిచింది. ఈ నెల 21, 22వ తేదీల్లో శ్రీకాకుళం జిల్లా పలాసలో జరిగిన రాష్ట్ర స్థాయి పరుగుపందెం పోటీలో మొదటి స్థానంలో నిలబడింది. ఈ మేరకు సోమవారం ఎంఈఓ వెంకటరమణ బాలికను అభినందించారు.

హార్సిలీహిల్స్‌పై పోలీసు సమాచార కేంద్రం

బి.కొత్తకోట: మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌పై పోలీసు సమాచార కేంద్రం ఏర్పాటు కోసం సోమవారం మదనపల్లె రూరల్ సీఐ శివాంజనేయులు, స్థానిక ఎస్ఐ రామమోహన్‌లు కొండపై పలుచోట్ల స్థలాలను పరిశీలించారు. ప్రస్తుతం కొండకు వస్తున్న సందర్శకుల సంఖ్య భారీగా పెరగడంతో ప్రభుత్వ ఆదేశాలతో కేంద్రం ఏర్పాటు కోసం చర్యలు చేపట్టినట్టు వారు తెలిపారు. ఎక్కడ కేంద్రం ఏర్పాటు చేయాలి అన్నదానిపై వీఆర్ఓ ఖాదర్‌బాషా పలు స్థలాలను చూపించారు.

ఇందిరమ్మ కాలనీలో రెవెన్యూ అధికారుల సర్వే

గుర్రంకొండ: మండలకేంద్రంలోని ఇందిరమ్మ కాలనీలో రెవెన్యూ అధికారులు సర్వే నిర్వహించారు. కాలనీలో ప్రస్తుతం పునాదులు, గోడల నిర్మాణాలు చేపట్టిన వారి వివరాలను సేకరించారు. సోమవారం ఆర్ఐ చంద్రశేఖర్, వీఆర్వో నాగరాజల ఆధ్వర్యంలోని అధికారుల బృందం ముమ్మరంగా సర్వే నిర్వహించారు. మొత్తం 642 ఇళ్లు ఉన్న కాలనీలో ఇప్పటివరకు ఇళ్లు నిర్మించుకోని వారి వివరాలను నెలరోజుల క్రితం అధికారులు సేకరించారు. అప్పట్లో 12 సంవత్సరాలుగా పునాదులు నిర్మించుకోనివారు, అసలు ఇంతవరకు పునాదులే వేయకుండా ఖాళీగా ఉన్న స్థలాల వివరాల తోపాటు లబ్ధిదారుల వివరాలు సేకరించారు.

సైన్స్ మేళాతో విజ్ఞానం



విద్యార్థులు చేసిన ప్రయోగాలను పరిశీలిస్తున్న ఎంపీపీ, హెచ్ఎంలు

పెద్దమండ్యం: సైన్స్‌మేళాతో విద్యార్థుల్లో విజ్ఞానాన్ని పెంపొందించవచ్చని ఎంపీపీ గుర్రం పూర్ణచంద్రిక అన్నారు. మండలంలోని కలిచెర్ల ఉన్నత పాఠశాలలో సోమవారం విద్యార్థులకు ఫోర్ట్ సంస్థ ఆధ్వర్యంలో సైన్స్‌మేళా నిర్వహించారు. ఆయా ఉన్నత పాఠశాలల నుంచి మేళాలో విద్యార్థులు రూపొందించిన ప్రయోగాలను ఎంపీపీ పరిశీలించారు. ప్రయోగాల ఆవశ్యకత, వినియోగం గురించి విద్యార్థులు వివరించారు. మోడల్ పాఠశాల సేంద్రీయ వ్యవసాయ విధానం, అంతర పంటల సాగుపై ప్రయోగం చేసిన విద్యార్థులను ఎంపీపీ అభినందించారు. విజ్ఞానమేళాలతో విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మకతను వెలికి తీయవచ్చని ఆమె పేర్కొన్నారు. ప్రయోగాలను తయారు చేసే విద్యార్థులను సహచర విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. హెచ్ఎం భారతి, ఫోర్డ్ సంస్థ డైరెక్టర్ లలితమ్మ, మాజీ సర్పంచ్ విజయకుమార్, సంస్థ మండల కో ఆర్డినేటర్ నరసింహులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.